ఇంకా తొలికోడి మేల్కొలేదు. చీకటి చెక్కుచెదరలేదు. వార్ధక్యంలోపడ్డ రాత్రి వెలుగుకోసం దరఖాస్తు పెట్టుకుంది.

రవీస్ కెనాల్ కట్టపైన ఓ గుడిసెలో కోడిగుడ్డు లాంతరు మరణవేదన పడుతూ —చీకటికేసి చేతులుచాస్తూవుంది. లావుపాటి ఎర్రచీమ అన్యాయంగా కసి తీర్చుకోగా, కుక్కిమంచంలో తల్లి ప్రక్కన పడుకొన్న మూడునెలల పసిపాప కెవ్వున కేకవేసింది. తల్లి సగంనిద్రలోనే పిల్లను సముదాయించింది. ఈతాకుల చాపపై పడుకొన్న తండ్రి పీడకలనుంచి బయట పడ్డట్టు—పిల్ల ఏడ్పుకు లేచి కూర్చున్నాడు.

తన కూతతోనే తెల్లవారబోతోందన్న అహంకారంకొద్దీ తొలికోడి దీర్ఘంతీసింది.

తల్లి పక్కలోని పిల్లఏడ్పు మానలేదు. తల్లి విసుగ్గా లేచి కూర్చుంది. తీవ్రంగా గొణుక్కుంది. "ఈ పాడుసంతుకు ఏడ్పు దప్ప మరోపనిలేదు"

తెల్లవారబోతోందని తొలికోడి కూతతో గ్రహించిన రిక్షా రామన్న యీతాకుల చాప చుట్టుతూ భార్య మాటలకు బరువుగా నిట్టూర్పు విడిచాడు. తను సముదాయించేందుకు ప్రయత్నించాడు.

పదకొండు రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో మంచంపై కాపురంచేస్తున్న భార్య భర్తకేసి మహారోతగా చూసింది—

తాళ్లూరు నాగేశ్వరరావు

యీ కొంపలోని దారిద్ర్య దేవతకు నువ్వే ముఖ్యకారకుడివి అన్నట్టు. భూమిమీదకొచ్చి మూడు మాసాలైన ఆ పిల్ల ఆకలి కొద్దీ ఏడ్పు మానలేదు. భూలోకంలో . బాగా బ్రతుకుదామని ఆశపడ్డ ఆ పిల్లకు ఆదిలోనే ఆకలి రాక్షసి ఆవు రావురు మనడం గోచరించింది.!

తల్లి రొమ్ములకు పాలులేవు. ఆ సంగతి పసిపిల్లకు తెలీదు. తెలిసిన మొగుడు మటుకు — "ఏం పాలు లేకపోతే? కాస్త పిల్లను రొమ్ములకు అదుముకొని సముదాయించకూడదూ!" అనుకున్నాడు. కాని భార్య జ్వరపు ముఖంలో కొలిమిలో నిప్పులాంటి కోపం పిలుస్తే పలుకుతోంది. అందుకే రిక్షా రామన్న వానలో తడిసిన బొగ్గుముక్కకు మల్లే చప్పగా వూరుకున్నాడు.

పసిపిల్ల పాలకోసం గుక్కపట్టి ఏడుస్తూనే ఉంది. గుడిసెలోని కోడిగడ్డు లాంతరు సానుభూతిగా కన్ను మూసింది.

తూర్పురేఖలు తెల్లబడుతూ- తెల్లవారస్తోందని తెల్పుతున్నాయి.

"హోటల్ కెళ్ళి పిల్లకుపాలు పట్టుకొత్తాను" అన్నాడు రామన్న. దండేన వున్న పైపంచ తీసుకొని తలగుడ్డ చుట్టుకొంటూ.

"ఊఁ" మూలిగింది భార్య పిల్లను ఒళ్ళోకి తీసికొంటూ.

గుడిసె వెలుపలికి వచ్చాడు రామన్న. చొక్కా జేబులో కుడిచేయి పెట్టి తడిమి చూశాడు. మూడు నయా పైసలూ, ఎంగిలి చుట్ట పీకె తగిలాయి. కిరాయి తోలి, బోణీతో పాపకు పాలు తేవాలి అనుకున్నాడు. రోడ్డు ప్రక్కన నిలబెట్టి వున్న రిక్షాని తొక్కుకుంటూ—స్టేషనుకేసి వెళ్ళాడు రామన్న జి. టి. వచ్చే టైమయిందని అనుకుంటూ.

జి. టి. ఎక్స్‌ప్రెస్ అరగంట లేటు.

మెయిల్ కూడా రాలేదు.

స్టేషనుముందు రిక్షాడ్రైవర్లు రైళ్ళ కోసం, ప్రయాణీకులకోసం – సందడి చేస్తూ, ఎదురుచూస్తున్నారు.

బందర్నుంచి ప్యాసెంజరు వచ్చింది. రిక్షావాళ్లు ఎగబడ్డారు. రామన్న రిక్షాకు బేరం తగల్లేదు. ప్రయాణీకుల్ని సూదంటురాయిలాగా ఆకర్షించే నేర్పు రామన్నలో లేదు. 'ఏయ్! రిక్షా!' అని ఎవరైనా పిలిచేవరకూ - ఇది రిక్షా ఎక్కే ముఖమని తేల్చుకోలేడు.

అయిదు నిముషాలు గడిచేసరికి జి.టి. ఎక్స్‌ప్రెస్ వస్తోందన్న కలకలం బయలుదేరింది.

రామన్న రిక్షాకి బేరం వచ్చింది. అప్పుడే తూర్పున సూర్యోదయమైంది. పట్టణమంతా నిద్రనుంచి మేల్కొని, కళ్లు నులుముకుంటూన్నట్టుగా వుంది వాతావరణం. రెండు వందల పాతిక పౌన్లకు రెండు పౌన్లు తక్కువగల బరువైన ఓ వ్యక్తి గాంధీనగరానికి - మూడు అణాల కిరాయితో రామన్న రిక్షాని మాట్లాడుకొని, జాగ్రత్తగా ఎక్కి కూర్చున్నాడు. సైకిలురిక్షా టైర్లు సిమ్మెంటు రోడ్డుమీద ఒక్కసారి 'అమ్మ! బాబోయ్' అంటూ నిట్టూర్పు విడిచాయి.

రామన్న రిక్షా సాధ్యమైనంత వడిగా తొక్కుతున్నాడు. రోడ్డుమీద వచ్చే పోయే మనుషుల్నీ, ఎదురుగ్గా వచ్చే వాహనాల్నీ తప్పించుకొంటూ జాగ్రత్తగా రిక్షాని పోనిస్తున్నాడు. గంటమీద చేయి అల్లలాడుతూనే ఉంది. రిక్షామీద కూర్చున్న లావుపాటి మనిషి వీధికి అటూ ఇటూ చూపుల్ని పారేసుకుంటున్నాడు. రిక్షా చక్రాలు రివ్వున తిరుగుతున్నాయి. రామన్న మనస్సుకూడా అట్లానే తిరుగుతూన్నది.

....ఇంటికాడ పాప పాలకోసం గుక్కపట్టి ఏడుస్తావుంటాది. తల్లిదగ్గర పాలు లేవు. పైగా దానికి జొరం. ఈ కష్టాలన్నీ తనబోటి పేదాడికి ఒక్కసారే రావాలా? బగవంతుడికా పాటి దయ వుండక్కర్లా! తనేం చేస్తాడు? రాత్రీ పగలూ కాళ్లు అరిగిపోయేట్టు, వొళ్లు కమిలిపోయేట్టు రిచ్చా తొక్కినా రూపాయి డబ్బులు మిగలవు. దానితో పొయ్యిమీద కుండ ఎక్కాలి. మరి దాని రోగానికి మందు లేడనుంచి వత్తాయి? పిల్లదానికి పాలెట్టా వత్తాయి? తను సోమరిపోతు కాదాయె. రాతిరీ పగలూ రెక్కలాడిత్తూనే వుంటున్నాడాయె! బగవంతుడు పాపం సేసినోళ్లకుగానీ యీ దరిద్రపు బ్రతుకీయడుకా మోసు! యెనక జనమలో తను కుతికె మీర పాపం చేసివుంటాడు. అందుకే యీ జనమలో యీ నరకం. అయినా రిచ్చా తోక్కేవాళ్ల బతుకులన్నీ యిట్టాగే యేడ్చినాయనా? కాదు. ఆ నరసింహులుగాడూ, మస్తానయ్యా, కోటి నాగులూ, పగులుగోడూ - యీళ్ళంతా ఎంత జలసాగా, పైలా పచ్చీసుగా బతుకుతుంటారు. సీటికిమాటికి టీలు, సిగిరెట్టులు కిళ్లీలు, సినిమాలు, అప్పుడప్పుడూ తెల్లకాపీ - నా సామిరంగ వాళ్లకి - కాలం కైలాసంలో జరిగినట్టుగా జరిగిపోతుండాది. మరి తన కరమ యిట్టా కాలిందేం?....తనకి కాలంకొద్దీ బతకడం సేతకాదు. వెధవ్వేషాలు వేయలేడు. అబద్ధాలతో నాలికెను తడుపుకోలేడు. మోసంతో ముద్దను మింగలేడు. అన్యాయానికి కళ్లుమూసికోలేడు. తనలో వుండ తెగులే యిది. ఈ తెగులు గల మడుసులు యీ రోజుల్లో సుకంగా బతకలేరు. ఆళ్లకి కష్టాలే కాలచ్చేపం. సుకాలు మటుకు కలల్లోకి వత్తాయి. ఈ కష్టాలన్నింటికీ మూలం డబ్బు. డబ్బుంటే కష్టాలుండవు. దేవుడి పేరు తలవక్కర్లేదు. ఇప్పుడు తనకి కనీసం వంద రూపాయలైనా వుంటే - యీ కష్టాలుండవు. దీనిని డాకటేరు కాడకు తీసికెల్లి మంచి మందు యిప్పించవచ్చు. రోగం తొరగా నయమవుతాది. పసిగుడ్డు పాలకేడ్వాల్సిన పనిలేదు. కాని యివన్నీ గొంతెమ్మ కోరికలు. ఇప్పుడు తనకి వంద రూపాయ లెక్కడ్నుంచి వత్తాయి? తన బతుకింతే! యీ కష్టాలు, దరిద్రం, కుమిలి కుమిలి యేడ్పు, రేపెట్టా గడుత్తాదనే దిగులూ, రోజంతా పేగులు వూడిపడేట్టు రిచ్చా తొక్కడము....యిదే తన బతుకు.... ఆలోచించుకుంటూ రామన్న రిక్షా తొక్కుతూండగా గాంధీనగరం వొచ్చింది.

మూడు మలుపులవరకూ రిక్షామీద కూర్చున్న లావుపాటి వ్యక్తి సూచన యిచ్చి, నాలుగో మలుపులో ఓ కొత్త డాబా రాగానే - "ఏయ్! రిక్షా ఆపు" అన్నాడు.

రిక్షా ఆగింది.

రిక్షామీద కూర్చున్న లావుపాటి వ్యక్తి రిక్షామీద కూర్చుండే ప్రక్క జేబులోంచి మూడణాలు తీసి - "ఇదిగో" అని రిక్షావాడికిచ్చి, గబగబా కొత్త డాబాలోకి వెళ్లాడు.

రెండుబార్ల పొద్దు పైకి ఎక్కింది. ఎండ ఉన్న దున్నట్టుగా పడుతోంది. "బాగా పొద్దెక్కింది. పిల్లది పాలకోసం ఎట్టా ఏడుత్తున్నాదో" అనుకుంటూ రామన్న రిక్షా వెనక్కు తిప్పాడు. వంద గజాల దూరం వెళ్లాక వెనక్కు తిరిగి రిక్షాసీటుకేసి చూశాడు ఏదో చప్పుడు

అవుతూంటే. రిక్షాసీటు ప్రక్కన చిన్న తోలుసంచీ ఉన్నది. వెంటనే రిక్షా ఆపి, దిగి చూశాడు రామన్న. "ఆ లావుపాటి బాబుది కామోసు. మరిసిపోయాడేమో!" అనుకున్నాడు. అనుకుంటూనే అప్రయత్నంగా చిన్న తోలుసంచీ విప్పి చూశాడు. కళ్లు బైర్లుకమ్మిన పర్యంతమైంది.

మూడు పదిరూపాయల నోట్ల కట్టలు, నాలుగు అయిదురూపాయల నోట్ల కట్టలు "అమ్మ బాబోయ్! ఎంత డబ్బు! ఎంత డబ్బు!" అని రామన్న మనస్సు పొలికేక పెట్టింది. అంతలోనే వొళ్లంతా చెమట దిగజారింది, కాళ్లూ, చేతులూ, గుండె, - గజగజ వొణక నారంభించాయి. వెనక్కీ ముందుకూ, ముందుకూ వెనక్కీ, చుట్టు పక్కలా — బెదురుగా భయంగా, భయంగా బెదురుగా, గాబరాగా చూశాడు.

రిక్షాని అప్రయత్నంగా వెనక్కు మళ్ళించాడు.

ఎండలో వేడిమి హెచ్చింది. రామన్న బుర్రలో ఆలోచనలు కూడా వెచ్చబడ్డాయి.

....ఎంత పైకం! ఎంత డబ్బు!.... తను లెక్కపెట్టలేదు. ఇయ్యాల తనులేసి వోడిమొకం సూసినాడో—ఎంత పైకాన్ని కళ్ళ జూశాడు? ఇంతమట్టుకు బతుకులో తను యింత డబ్బును కళ్లారాసూడలా. అదృష్టం అంటే యిదే కామోసు. లచ్చీదేవి తనపై దయసూపి—యీ పైకం తన రిచ్చాలో వొదిలేసేట్టు సేసింది. ఈ పైకాన్ని తనేం సేయాలి? ఎట్టా ఉపయోగించుకోవాలి?....ఇప్పుడు తను దరిద్రుడు కాడు. ఈ డబ్బుతో తన దరిద్రం వొదులుతాది. ఇఖ రిచ్చా తొక్కక్కర్లేదు, పసిగుడ్డు పాలకి ఏడ్వక్కర్లే. దాన్ని తను పెద్ద డాకటేరు కాడకు తీసికెళ్లొచ్చు. రోగం నయం సేయించొచ్చు. కాబట్టినన్ని సిలుకుసీరెలు బంగారం నగలూ కొనొచ్చు. తను ఇంకా ఆ మురికి గుడిసెలో కాలవకట్ట సెంత వుండక్కర్లా. ఓ పెంకుటిల్లు అద్దెకు తీసికొని అందులో దిట్టంగా వుండొచ్చు. ఏదేనా చిన్న బిజినేస్ సేయొచ్చు. నాలుగు రిచ్చాలు కొనిపడేత్తే, రోజూ పదిరూపాయల కాడకు వస్తాయి. కాలు మీద కాలేసుకొని—జల్‌సాగా బతకొచ్చు. రెండు మూడేళ్ళల్లో పది పదిహేనేలు సంపాయించొచ్చు. ఆ మీద ఇంకా పెద్ద బిజినేస్ సేసి, లచ్చలు సంపాయించొచ్చు. రిచ్చా తొక్కే రామన్న లచ్చాదికారయ్యాడని దేశమంతా ఆగుబ్బుగా సెప్పుకుంటారు కామోసు! అప్పుడు పెద్ద మేడ కట్టొచ్చు, సేర్‌మేన్‌గారి మేడంత పెద్దది నల్లటి, బారాటి కారు కూడా కొనొచ్చు. తనూ, అదీ, పిల్లలూ ఆ కారులో సికార్లకీ సినిమాలకీ పోతూంటే—నా సామిరంగ, యీ రిచ్చాతొక్కే నరసింహులూ, మస్తానయ్యా, కోటినాగులూ, పగులుగోడూ నోరు తెరిసి, ముక్కుల మీద యేళ్లు యేసికోవాల్సిందే!....ఏముంది? అదృష్ట దేవత సల్లని సూపు సూత్తే—బళ్లు ఓడలవుతాయి గుడిసెలు మేడలవుతాయి; రిచ్చా తొక్కే వాళ్ళు లచ్చాదికార్లవుతారు. ఇదే లోకంలో గమ్మత్తు! బగవంతుని యిసిత్రం!....

మెర్క్యురీ లైటు కాంతివలె సంతోషం మనస్సులో వెలుగుతూంటే, రామన్న రిక్షా తొక్కుకుంటూ ఆ లావుపాటి వ్యక్తి కొత్త డాబా ముందుకే వొచ్చాడు. ఆపైన సైకిలు రిక్షా పెడల్స్ పైన కాళ్ళు ఆనలేదు. రిక్షా కదల్లేదు. రిక్షా మీద నుంచి రామన్న దిగాడు. అంతా అయోమయంగా తోచింది. తనేం ఆలోచించాడు? తనేంచేయబోతున్నాడు? తనేం చేయదల్చుకున్నాడు?—ఏది సబబు? ఏది న్యాయం?....ఏది ధర్మం?....రిక్షా రామన్న మనస్సులో ఆ కొత్త డాబా ముందు కొన్ని క్షణాలపాటు తీవ్రమైన సంఘర్షణ జరిగింది. ఇంట్లోకి వెళదామా ఆ సంచీ ఇద్దామా? అబ్బే! అంత డబ్బే! తిరిగి యిచ్చేయటమే! తన బ్రతుకు, తను

"మన డ్రైవరును తీసేద్దా మనుకుంటున్నాను. వెధవ నాలుగుసార్లు మన కారుని గుద్దించే ప్రాణాలు తీసేయ బోయాడు."
"పాపం ఆమాత్రందానికే తీసేయడం ఎందుకండి, ఇంకొక్కసారి చూడండి."

వూహించిన అందమైన జీవితం! ఎట్లా ఆ డబ్బు తిరిగి యివ్వడం?'—'ఛీ, వెధవది. న్యాయం న్యాయమే. ధర్మం ధర్మమే. తన రిక్షాలో దొరికిన వస్తువును తను దాని యజమానికే అందజేయటం న్యాయం, ధర్మం. అన్యాయపు కూటికే ఆశపడకూడదు. ఆశపడినా—అది నిలవదు. తను యిచ్చేయటమే సబబు.

రామన్న అంతర్మనస్సు న్యాయం—ధర్మం ప్రక్కకు మొగ్గుచూపింది మనస్సు పైని మాయమబ్బులు పెనుగాలికి గడ్డిపోచలలా తొలగిపోయాయి. కొన్ని క్షణాల తర్వాత రామన్న మనస్సు—వాన కురిశాక వచ్చిన తెల్లఎండవలె ఐంది. కొత్తడాబా వరండాలోకి వెళ్ళాడు. ఆ లావుపాటి వ్యక్తి వాకిటతెర తొలిగించుకొని, పేపరు చేత్తో పట్టుకొని వరండాలోకి వచ్చాడు.

"బాబుగోరూ! ఇందాక మీరు రిచ్చాలో యీ తోలుసంచీ మర్చిపోయినారు" అన్నాడు రామన్న సవినయంగా.

రెండువందలపాతికె పౌన్లకు రెండు పౌన్ల తక్కువ బరువుగల ఆ లావుపాటి వ్యక్తి—రబ్బరుబంతివలె ఎగిరి గంతేసి, ఆ చిన్నతోలుసంచీ తీసికున్నాడు.

"నా మతిమరుపు మండిపోనూ! ఈ డబ్బుసంచీనే రిక్షాలో వదిలేశానన్నమాట. ఇందులో అయిదు వేల రూపాయలున్నాయి" అంటూ ఆ లావుపాటివ్యక్తి గబగబా సంచీతెరచి పైకం చూసుకున్నాడు. సంపూర్ణంగా సంతృప్తి పడ్డాడు.

"నువ్వురా అబ్బీ, యీ యుగంలో సత్య హరిశ్చంద్రుడి లాంటి మనిషివి అంటే, నీ నిజాయితీకి, న్యాయమైన బుద్ధికి, సత్ప్రవర్తనకూ — హృదయపూర్వకంగా మెచ్చుకుంటున్నాను. నిజంగా నువ్వు దేవాంశ సంభూతుడవంటే అతిశయోక్తి కాదు. కనుకనే యీరోజుల్లో యింత మొత్తం పైకంగల సంచీని — ఆశ రవ్వంతకూడా లేకుండా నీతికీ, నిజాయితీకి నిలబడి. భద్రంగా తీసికొచ్చి అప్పగించావు నిన్ను ఎంతగొప్పగా, పొగిడినా మాటలు చాలవు. ఋజువర్తన అనేది సహజంగా వచ్చేదేగానీ—డబ్బువల్లరాదు. కనకాలకు దాసుడుకానివాడే వాస్తవమైనవ్యక్తి. అతనే పుణ్యాత్ముడు. అతనే మోక్షానికి అర్హుడు. అతనే భగవంతుని కరుణాకటాక్ష వీక్షణాలకు పాత్రుడు. సరే! నువ్వు వెళ్లు అబ్బీ! అవతల నాకు బోలెడంత పనివుంది" అంటూ వాకిటి తెర తొలగించుకొని గబగబా ఇంట్లోకి వెళ్ళాడు, రెండువందల పాతికె పౌన్లకు రెండుపౌన్ల తక్కువ బరువుగల ఆ సన్న పాటివ్యక్తి.

ఆ మాటలు విన్న రిక్షా రామన్నకు మనస్సు ఆవిరియైంది. రిక్షా తొక్కుకుంటూ బీసెంటు రోడ్డు మీద కొచ్చాడు. కాని ఏదో పోగొట్టుకున్నట్టుగా, నోటిదగ్గర వరకూ వచ్చిన అమృత పాత్ర జారిపోయినట్టుగా బెంగగా, అశాంతిగా — 'ఫీల్' కాజొచ్చాడు.

పదమూడు నయాపైసలిచ్చి, అరకప్పు పాలుపోయించుకున్నాడు సత్తు గ్లాసులో —పాపకోసం. మెల్లగా రిక్షాని నడిపించుకుంటూ ఆ పాలగ్లాసుని తీసికెళ్లుతున్నాడు రామన్న, కావి అతని మనస్సులో ఆ నోట్లకట్టలు తోరణాలవలె వ్రేలాడుతూ గేలిచేస్తునే వున్నాయ్, 'ఎవరికైనా నోచుకోవాలి'—అంటూన్నట్టున్నాయి.

ఎండ రంగూ, తీక్షణతా ముదురుతున్నాయి. రోడ్లమీద సందడికూడా హెచ్చుతూన్నది.

ఒక నల్లటి, బారాటి కారు ఎండలో మెరిసిపోతూ, తన హోదాను ఇనుమడింపజేసే హారన్ మోతతో - వేగంగా, రోడ్డుపైని దుమ్మును దిట్టంగా లేపుతూ, రామన్న రిక్షా ప్రక్కగా దూసుకుపోయింది. పరధ్యానంలోవున్న రామన్న భయపడి, బెదిరి, మనస్సు ఒక్కసారి బెదిరి - రిక్షాను కారుక్రింద పడకుండా చేసే జాగ్రత్తలో పాలగ్లాసును రోడ్డుపై జారవిడిచాడు. కారు దుమ్ము కళ్లల్లో జోరుగా పడగా, కళ్లనులుముకున్నాడు. తెల్లనిపాలు రోడ్డు దుమ్మును కరచాయి. రామన్న మనస్సు బావురుమన్నది. కళ్లల్లో నీళ్లు తొంగిచూశాయి. రోడ్డుమీద నడిచే జనమంతా—తమ కళ్లను దుమ్ము నుంచి కాపాడుకోవడంలో సతమతమయ్యేరు. కానీ, రామన్న కళ్లల్లో నీళ్లు ఎందుకు తొంగిచూశాయో గమనించలేదు. కాని అతని కళ్లల్లో నీళ్లు కారుదుమ్ము పడి తొంగిచూడలేదు.

రామన్న కళ్ళముందు — పాలకోసం గుక్కపట్టి యేడ్చే పసిగుడ్డు మెదిలింది. రామన్న కళ్లముందు—పసిగుడ్డు మీద విసుగుతో విరుచుకుపడే భార్య మెదిలింది. రామన్న కళ్లు నీటిని వర్షించాయి. రామన్న మనస్సులోంచి ఆ నోట్లకట్టల శోభ తొలగిపోలేదు. రామన్నహృదయం ఖేదంతో మూలిగింది.

"ఏయ్! రిక్షా" పేవ్ మెంటుమీద నిలబడి ఎవరో పిలిచారు.

రామన్న ముఖంపైని దుఃఖం ఒకసారి దిగజారి — ఆశారేఖలు నిక్కబొడుచుకున్నయ్.

"బాబూ!" అంటూ వాళ్లదగ్గర కెళ్లాడు.

కాశేశ్వరరావు మార్కెటు దగ్గరకు పావలా యిచ్చేట్టూ, ఇద్దరు వ్యక్తులు రిక్షాలో ఎక్కేట్టూ మాట్లాడుకున్నాడు.

రిక్షా తొక్కుతూ— ఈ పావలా కిరాయిలో బేడ కిరాయితో, తను పాపకు పాలు కొనుక్కొని వెళ్ళవచ్చు ననుకున్నాడు రామన్న. ఆ ఆశే అతని ఖేదానికి తాత్కాలికంగా ఉపశమనం కలిగించింది.

రామన్న కాశేశ్వరరావు మార్కెట్టు తిన్నగా రిక్షాని ఆపాడు. వాళ్లు దిగారు. పావలాబిళ్ల రామన్న ముఖాన విసరివేసి, గబగబా మార్కెట్టులోకి వెళ్ళారు.

"సుబ్బీ: బావను పెళ్ళాడతావు కదుటే?........."
"మరేఁ;....నేను అచ్చ బి. సరోజాదేవిలాగే ఉంటానంటూ అంటూన్నారంతా; మరి బావని నాగేశ్వర్రావు, రామారావు లాగే ఉంటాడని అంటున్నారా?"

ఆపావలాబిళ్ళ తీసికొని గబగబా రామన్న హోటలుకువెళ్ళి, బేడ పాలు పోయమని సత్తుగ్లాసు యిచ్చాడు.

ఆ పావలా బిళ్ళని అటూ ఇటూ, ఇటూ అటూ, తల్లక్రిందులుగా పట్టి చూసిన హోటలు ప్రొప్రైటరు—ఒక్క విషపునవ్వు నవ్వి "ఈ పావలా మారదు" అన్నాడు కోపంతో కంఠాన్ని ఖంగుమనిపిస్తూ.

రామన్న ముఖం చితికిన టొమేటోలాగైంది. నీళ్లు కారిపోయాడు. నీరసంతో నేలమట్టమైనాడు. నోట మాట రాలేదు. నిముషమున్నరసేపు అట్లాగే నిలబడిపోయాడు.

హోటలు ప్రొప్రైటరు విసిరేసిన మారని పావలాని రోడ్డుమీదనుంచి తీసికున్నాడు. "ఎంత మోసం?" అనుకున్నాడు.

"ఏం రామన్నా! ఇయ్యాల ఏపాటి కిరాయి దొరికింది?" అంటూ సుబ్బులు రిక్షా తొక్కుకుంటూ వచ్చాడు.

"నాబోటి మొకాలకేనా కిరాయి దొరికేది?" అన్నాడు రామన్న నిరాశ ధ్వనించే విసుగుదలతో.

"ఏం అట్లా అంటావు! ఇంకా బోణీ పలకలేదా, ఏఁటీ!"

"పలికింది. పలక్కేం?"

"అయితే-"

"సూడు, సుబ్బులూ! ఈ పావలాబిళ్ల సెల్లదా?"

ఆ పావలాబిళ్లను చిటికెవేసి మ్రోగించి చూసి - "క్రిష్ణాబ్రిడ్జిమీద జనతాకింద బెట్టు. అంతకుతప్ప యిడిసి యిదెందుకూ పనికిరాదు. ఎట్టా మోసపోయావు రామన్నా! మడిసిలో మెతకుంటే అంతా యిట్టాంటి సరుకే గిడతాది." అన్నాడు సుబ్బులు.

సుబ్బులుకూడా రిక్షా తొక్కేవాడే. రామన్న గుడిసె ప్రక్కనే రవీస్ కెనాల్ కట్టపైన వుంటున్నాడు. ఇద్దరూ ఒకే వృత్తిలో స్నేహితులే కాకుండా - ఇరుగు పొరుగు వాళ్ళు. సుబ్బులు పదునైన నైజం గలవాడు. కాలంలో మార్పు కొద్దీ తన ప్రవర్తనలోను ఎప్పటికప్పుడు మార్చుకొనే నిపుణుడు. పరుగెత్తి పాలు త్రాగుదామనే ఆశగలవాడేగానీ నిలబడి నీళ్లు త్రాగుదామన్న శాంత స్వభావి కాడు.

సుబ్బులు మాటలకు రామన్న పంచరు బడ్డ సైకిలు ట్యూబుకుమల్లే నిట్టూర్చాడు.

"పసిపిల్ల ఝామూ పొద్దుకాడనుంచీ పాలకోసం ఏడుస్తాది, కిరాయితో హోటల్లో పాలు తెస్తానని సెప్పినా ఇంకా యీడనే దేకుతున్నా."

"ఓస్! అంతేనా?" సుబ్బులు తుస్కారంగా నవ్వాడు.

"నువ్వట్టే మనేద బెట్టుకోవాక. నేను హోటల్లోపాలు తెచ్చి యిచ్చానులే. నిదర మంచంమీన లేచేతలికి మీ పసిదాని ఏడుపు వినవచ్చింది. సంగతి కనుక్కొని నువ్వు పాలు తెచ్చేతలికి ఎట్టాగూ సూరేడు నెత్తిమీన కొస్తాడని సెప్పి, నేనే తెచ్చి యిచ్చా" అన్నాడు సుబ్బులు బెంగుళూరు బీడి ముట్టిస్తూ.

"ఆఁ! యాందీ" రామన్న అపరమితమైన ఆశ్చరంలో అపూర్వమైన ఆనందాన్ని పొందాడు, అతని ముఖం ఒక్కసారి సంపూర్ణమైన సంతోషంతో యార్డ్లీ సోపుతో మూడుసార్లు తోముకున్నంత వికసించింది.

కొన్ని క్షణాలపాటు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం నిటారుగా తల ఎత్తింది. రామన్నను పూర్తిగా ఉల్లాసపడనిచ్చి, "ఏఁటీ! యియ్యాల యిశేశాలు?" అన్నాడు సుబ్బులు బీడీ పొగవూదుతూ.

"ఇయ్యాల నేను బలే గనకార్యం సేసినా" అన్నాడు రామన్న ఆనందోత్సాహాలుమనస్సులోకుస్తీపడుతూండగా. సుబ్బులు కనుబొమలు ప్రశ్నార్థకంగా ఎగురవేశాడు.

రామన్న తనకు రిక్షాలో అయిదువేల రూపాయల చిన్న తోలు సంచి దొరికినట్టూ, దాన్ని తను న్యాయానికీ, ధర్మానికీ కట్టుబడి భద్రంగా తిరిగి ఆ లావుపాటి యజమానికిచ్చినట్టూ చెప్పాడు. అంతావిని సుబ్బులు సీమ టపాకాయ పేలినట్టుగా అన్నాడు.

"ఏడిశావ్ ! ఎర్రినాగన్నా ! వోడన్నా అంతపైకం దొరికితే — వూరకనే విడిసిపెడతాడా? .... ఎంత యివరం తక్కువ పనిసేసేవురా పిచ్చి సన్నాసీ! వెయ్యేళ్లు రిచ్చాతొక్కితేమట్టుకు — అంతడబ్బు మన సేతికొస్తాదా ? ఛా. ఛా. సేతిలోకొచ్చిన లచ్చిని — జారవిడిసావ్ ! ఈ దరిద్రపు బతుకే నీకు సుకంగా వుందా? నీకు కరుసుపెట్టను సేతకాకపోతే — మాబోటివాళ్ళం ఎంతమందిమి లేము? నిమిట్ట మీన రూపాయిల్ని అల్లల్లాడించే వాళ్లం!. యింతకూ, సేతిలో గీతవుండాలి. నీకు పదిరూపాయలన్నా బహుమానం యిచ్చినాడా !"

"ప్చ్" పెదవి విరిచాడు రామన్న.

"ఎందుకిత్తాడూ ! బాగా మెచ్చుకొని మేకతోలు కప్పివుంటాడు. అంతేగదూ ! ఆడనేవుంది కిటుకు. మంచితనానికి మెప్పుదల మాటలేగానీ— ఫలితం శూన్యమేగా! డబ్బుగలోళ్ళకి దయతక్కువ. అది ఆళ్లకు లాభమే! డబ్బులేనివాళ్ళకి దయతక్కువైతేనే నష్టం! ఆ కిటుకు కనిపెట్టి నడ్చుకోవాలోయ్ రామన్నా! రోజులు ఎట్టా మండిపోతున్నాయో, తెల్సా!"

"ఏయ్ ! రిక్షా!.... వస్తావా?" క్లాత్ ఎంపోరియమ్ ముందుండి ఎవరో కేక వేశారు.

రామన్న రిక్షా తొక్కుకుంటూ వెళ్ళాడు.

సుబ్బులు బీడీ పీల్చటం మానేసి రోడ్డు మీద విసిరేసి, రిక్షా తొక్కుకుంటూ స్టేషను కేసి వెళ్ళాడు.

అదే రోజు సాయంత్రం రామన్న కాళీ రిక్షా తొక్కుకుంటూ అలంకార్ ధియేటర్ మీదుగా మెల్లగా వెళుతూండగా— "ఏయ్! రిక్షా! ఆగు" అంటూ ఆలావుపాటి వ్యక్తి పిలిచాడు.

ఎందుకో అనుకున్నాడు రామన్న.

రెండువందల పాతిక పౌన్లకు రెండు పౌన్లు తక్కువ బరువుగల ఆలావుపాటి వ్యక్తి ఒక్క ఉదటున రిక్షాలో ఎక్కి కూర్చుని "త్వరగా స్టేషనుకు పోనివ్వు" అన్నాడు.

ఆయన ముఖంలోని ఆదుర్దానీ, తొందరనీ, చికాకునూ కనిపెట్టాడు రామన్న. రిక్షా త్వరగానే తొక్కుతున్నాడు. వెల్కమ్ హోటలు దాటాక—

"నువ్వు ప్రొద్దున పొరపాటు పని చేశావోయ్," అన్నాడు రిక్షాలో కూర్చున్న లావుపాటి వ్యక్తి.

"ఏంటి బాబుగారూ !" అన్నాడు రామన్న.

"ప్రొద్దున నువ్వు ఆ డబ్బు నాకు తిరిగి యివ్వక పోయినా బావుండేది. నీబోటి పేదవాడు బాగుపడేవాడు."

'అదేంటి బాబుగోరు! అట్టా అంటారు' అన్నాడు రిక్షారామన్న తికమకపడుతూ.

"ఏముంది? ఆ డబ్బు ఇంట్లోపెట్టాను. మధ్యాహ్నం నిద్రబోతున్న సమయంలో దిండుక్రింద తాళం చెవులు తీసికొని, మా యింట్లో తింటూ బి. యే. చదువుకొంటూన్న బావమరిది, ఇనుప్పెట్టె తీసి, ఆ డబ్బుతో పరారీయైనాడు. ఏ హైద్రాబాదో, మద్రాసో వెళ్లివుంటాడు. వాడ్ని వెతికి పట్టుకొనేసరికి—ఆ డబ్బును కాస్తా హారతి కర్పూరంలా కరిగించి వేస్తాడు. నువ్వు నాకు ఆ డబ్బును తిరిగి యిచ్చిన ప్రయోజనమే లేక పోయిందోయ్!.... పాపం! నీకు బహుమానంగా పాతిక రూపాయ లిద్దామనుకున్నాను. తీరా నువ్వు వెళ్లాక ఆ ఆలోచన మనస్సులో మెరిసింది. డబ్బు దొరికిన సంతోషంలో అప్పుడు నాకు తోచలేదు.

ఆ పాతిక రూపాయలు యిప్పుడిస్తాడేమోనని రామన్న యినుమిక్కిలిగా సంతోషపడ్డాడు.

స్టేషనుమీదుగా సూర్యుడు ఎర్రగా మిడిసిపడుతున్నాడు. నర్సరావుపేట నుంచి ట్రైన్ వచ్చినట్టుంది. ప్రయాణీకులు వస్తున్నారు. లైసెన్సుకూలీలు సామాన్లు జేరవేస్తున్నారు.

రామన్న బుకింగ్ ఆఫీసుముందు రిక్షాని ఆపాడు. ఆ లావుపాటి వ్యక్తి క్రిందకు ఒక్క దూకు దూకాడు. రిక్షా టైర్లు పునర్జన్మను పొందినంత 'రిలీఫ్'తో నిలబడ్డాయి.

"ఎంత యివ్వమంటావోయ్" అన్నాడా లావుపాటి వ్యక్తి ప్రక్క జేబులో చేయిపెడుతూ.

"ఓ పావలాడబ్బులు దయసేయండి బాబూ! పేదోడ్ని" అన్నాడు రామన్న ముసిముసి నవ్వులు నవ్వుతూ, చేతులు నలుపుకొంటూ.

ఆ లావుపాటి వ్యక్తి గండుచీమ కుట్టినట్టు ఎగిరిపడ్డాడు.

"ఈ కాస్తదూరానికిపావలాఅటోయ్ ఆశకు అంతుండాలి. ఇదిగో పదమూడు నయాపైసలు. మామూలు కిరాయ్" అంటూ పదమూడు నయాపైసలిచ్చి బుకింగ్ ఆఫీసులోకెళ్ళాడు. ఆ రెండొందలపాతికె పౌన్లకు రెండుపౌన్ల తక్కువ బరువుగల వ్యక్తి బుకింగుఆఫీసులోకి చిన్న రోడ్డురోలరు దొర్లించినట్టుగా నడుస్తూ.

అరిచేతులో పడ్డ ఆ పదమూడు నయాపైసలకేసి చూస్తూ—సుబ్బులు అన్న మాటల్ని స్ఫురణకు తెచ్చుకున్నాడు రిక్షారామన్న. ★